

ఈ సృష్టిలో ఎంతో విలువైనది, అపురూపమైనది అమ్మ ప్రేమ. అమ్మ నీడన అడుగులేస్తూ సాగించే జీవన ప్రయాణం అందమైన జీవితాన్ని ఇస్తుంది. అలాంటి అమ్మను కష్టాలు వెంటాడాయి. ఆదుకుని అక్కున చేర్చుకునే వారు కన్పించకపోవడంతో ఆమె జీవితం చీకటిమయం అయ్యింది. కష్టాల సుడిగుండంలో ఉన్న తన జీవితాన్ని అర్ధాంతరంగా ముగించాలనే కఠిన నిర్ణయం తీసుకుంది. తాను మరణించినా తన కూతురు బతికుండాలన్న ఉద్దేశంతో చిన్నారిని ఇతరుల చేతుల్లో పెట్టి చావును వెతుక్కుంటూ వెళ్లింది. చావాలని ఎంత ప్రయత్నించినా తన కూతురు పదేపదే గుర్తుకు రావడంతో కన్నప్రేమను వదిలుండలేక తిరిగి వెనక్కు వచ్చేసింది. తన కూతురిని తనకు ఇవ్వాలంటూ పోలీసుల ఎదుట వాపోయింది. కదిరి ఆర్టీసీ బస్టాండులో ఆదివారం నాడు ఓ చిన్నారని వదిలేసి వెళ్లిన ఘటన తల్లి వెనక్కు రావడంతో సుఖాంతం అయ్యింది. ఈ ఘటనకు సంబంధించి కదిరి సిఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

కష్టాలను భరించలేక.. కన్నప్రేమను వదిలుండలేక..!

◆ఆత్మహత్య కోసం వెళ్లి తిరిగొచ్చిన తల్లి

ప్రజాశక్తి-కదిరి టౌన్

మహిళకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండలం గలగల గ్రామానికి చెందిన జ్యోతి అనే మహిళకు పెళ్లి అయ్యింది. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. సాఫీగా సాగుతున్న ఈమె జీవనం భర్త మరణంతో కష్టాలమయం అయ్యింది. భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలను అత్త మామలు చదివిస్తామని చెప్పారు. దీంతో ఆమె జీవనోపాధి నిమిత్తం బెంగుళూరుకు వలస వెళ్లింది. ఈ క్రమంలో కర్నాటక రాష్ట్రం దొడ్డబల్లాపూర్ జిల్లా బేతం గ్రామానికి చెందిన కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తాను అండగా ఉంటానని మహిళకు చెప్పడంతో ఆమె అతన్ని వివాహం చేసుకుంది. వీరిద్దరికి ఓ పాప పుట్టింది. ప్రస్తుతం వీరికి ఏడాది లోపు వయస్సున్న ఆడ బిడ్డ ఉంది. ఇటీవల భర్త నుంచి వేధింపులు అధికం కావడంతో జ్యోతి జీవితంపై విరక్తి చెందింది. రెండు రోజుల క్రితం తన కూతురిని తీసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. ఎలాగోలా ఆదివారం మధ్యాహ్నం కదిరికి చేరుకున్న ఆమెకు అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలో తెలియలేదు. ఇక తన కష్టాలకు చావే పరిష్కారం అని భావించి ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకుంది. తాను చనిపోయినా తన కూతురు బతికుండాలని భావించి ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ విద్యార్థినికి తన కూతుర్ని ఇచ్చి వెళ్లిపోయింది. మహిళ ఎంత సేపటికీ రాకపోవడంతో విద్యార్థిని ఆర్టీసీ అధికారుల సాయంతో చిన్నారిని పోలీసులకు అప్పజెప్పింది.

కూతురిని వదిలి ఉండలేక..

ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన మహిళ కదిరి సమీపంలోని పలు ప్రాంతాలకు కాలినడకన వెళ్లింది. పదేపదే తన కూతురు గుర్తుకు రావడంతో ఆత్మహత్య చేసుకోలేకపోయింది. ఇదే సమయంలో ఈ మహిళను గుర్తించిన స్థానికులు ప్రశ్నించారు. ఆమె పరిస్థితి కొంత అనుమానంగా ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా అసలు విషయం వెల్లడించింది. వెంటనే పోలీసులు ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కాగా ప్రస్తుతం మహిళ కూతురు పుట్టపర్తిలోని శిశు విహార్‌లో ఉందని, బంధువుల సమక్షంలో బిడ్డను ఆమెకు అప్పగిస్తామని సిఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తత స్థాయి సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

శాస్త్రీయ విద్య కోసం ఉద్యమం

◆ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు
◆3వ రోజు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శాస్త్రీయ విద్యకోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు తెలిపారు. అనంతపురంలోని అంబేద్కర్ భవన్‌లో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలు సోమవారం 3వ రోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో వస్తున్న మార్పులపై అధ్యయనం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో అశాస్త్రమైన భావాలను పాఠ్యపుస్తకాల్లో జొప్పించి, చరిత్రను వక్రీకరణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో ఏ పాత్రాలేని ఆర్‌ఎస్ఎస్ నాయకులను పోరాట యోధులుగా పాఠ్యాంశాలలో చేరుస్తున్నారని తెలిపారు. విద్య మొత్తం కేంద్ర ఆధిపత్యంలోకి తెచ్చేందుకు ఈ విధానం రూపకల్పన జరిగిందన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రయోజనాలు హరించబడి, రాష్ట్ర సంస్కృతి, చరిత్ర కనుమరుగైపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం ఈ విధానాలను అమలు చేసిన సమయంలో ప్రశ్నించిన టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తూ ముందుకుపోవడం విచారకరం అన్నారు. విద్యారంగం అభివృద్ధికి ఎన్నికల్లో ఇచ్చిన హామీపైన నేటికీ స్పష్టమైన ఆదేశాలు జారీచేయలేదన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే విద్యార్థులు, ప్రజలు చైతన్యవంతమై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శి ప్రసన్న కుమార్, ఎ.అశోక్, ఉపాధ్యక్షులు రామ్మోహన్, పరమేష్, వినోద్, నాయుడు, సహాయ కార్యదర్శులు అబ్దుల్లా, రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు రజిత, అమూల్య, పలు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అలా వదిలేశారు,,!

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగే అభివృద్ధి పనులకు నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా.. లేవా అని నిర్దేశించే క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ బాక్స్ టెండర్లు తెరవడంపై సంబంధిత అధికారులు కనీస దృష్టి కూడా సారించడం లేదు. వీటిని తెరిచేందుకు ఇంజినీరింగ్ అధికారులకు తీరిక లేదన్నట్లు వ్యవహరిస్తూ దానిని మూలన పెట్టేశారు. వీటిని తెరవడంలో అప్పటి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా జోడు పదవులు నిర్వహించిన అధికారి బద్ధకం మున్సిపల్ కార్పొరేషన్‌కు శాపంగా మారింది. సకాలంలో విధులు నిర్వహించటానికి ఆసక్తి చూపని ఆ అధికారి వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

◆బాక్సులోనే టెండర్లు..!
◆నాణ్యతాప్రమాణాలు పట్టని కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు
◆ఓ అధికారి బద్దకంతో 20 రోజులుగా టెండర్లు తెరవని పరిస్థితి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

క్వాలిటీ కంట్రోల్ టెస్ట్‌కు సంబంధించి సెప్టెంబర్ నెలలో బాక్స్ టెండర్లు నిర్వహించారు. టెండర్లు నిర్వహించిన తర్వాత వారం, పది రోజుల్లోగా వాటిని తెరవాల్సి ఉంది. ఆ సమయం దాటినా కార్పొరేషన్‌లో క్వాలిటీ కంట్రోల్ టెండర్లను నేటికీ తెరవలేదు. నాణ్యత ప్రమాణాలు తక్కువగా ఉంటే చేసిన పనులకు సంబంధించి నిధుల నుంచి అధికారులు కోత విధించే అవకాశం ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన టెండర్లను తెరవకపోవడంలో సదరు అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడం చూస్తే ఆయనకు విధులపై ఎంతో శ్రద్ధ ఉందో అర్థం అవుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. ఏడాదికి ఒకసారి నిర్వహించే క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్లకు సంబంధించి నాలుగు సంస్థలు పాల్గొన్నాయి.

టెండర్లు తెరవకుండా అలాగే ఉంచిన టెండర్ల బాక్సు

వీరిలో ముగ్గురు మాత్రమే టెండర్లు దాఖలు చేశారు. గత ఏడాది ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ అండ్ ప్లానర్స్ గుంటూరు వారు టెండర్లు దక్కించుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ అండ్ ప్లానర్స్ గుంటూరు వారితోపాటు కర్నూలు సిఈఎస్ కన్‌స్ట్రక్షన్స్, హైదరాబాదుకు చెందిన రెండు ఇంజినీరింగ్ కంపెనీలు టెండర్లలో పాల్గొన్నాయి. ఆఖరి నిమిషంలో బివిఆర్.ల్యాబ్స్ హైదరాబాద్ టెండర్ దాఖలు చేయలేదు. దీంతో మూడు సంస్థలు టెండర్లు వేశాయి. ఇవి దాఖలు చేసి ఇప్పటికి 20 రోజులు దాటినా వాటిని తెరవలేదు.

నగరంలో 15 ఫైనాన్స్, ఎన్‌క్యాప్ నిధులతో అభివద్ధి పనులు జరిగాయి. వాటికి సంబంధించిన నాణ్యతా ప్రమాణాలను తెలియజెప్పే క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ అతి ప్రధానమైనది. టెండర్లు నిర్వహించిన తర్వాత చాలినంత సమయం ఉన్న వాటిని ఉద్దేశపూర్వకంగా తెరవక పోవటంలో ఆ అధికారి ఆంతర్యం ఏమిటోనని గుత్తేదారులు ప్రశ్నిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న టెండర్లను తెరవకుండా నిర్లక్ష్యం చూపిన ఆ అధికారి, బదిలీ ఉత్తర్వులు అందుకున్న తర్వాత ఆయన లాభం చేకూర్చే ఇతర ఫైళ్లపై మాత్రం సంతకాలు చేశారు. క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్లు మాత్రం తెరవకుండా అలాగే ఉంచేశారు. ఈ అంశాలు ఏపీ కమిషనర్ నాగరాజు దృష్టికి వెళ్లకపోవడంతో వారు ఆడిందిఆట పాడింది పాటగా సాగింది. ఇదేఅదనుగా ఒకే హోదాలో విధులు నిర్వహించే ఇద్దరు ఎగ్జిక్యూటివ్ అధికారులు బదిలీపై వెళ్లడానికి ముందు వారికి అవసరం అయిన ఇతరత్రా అన్ని కార్యకలాపాలు చక్కబెట్టిన అధికారులకు క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ బాక్స్ టెండర్లు తెరవాలన్న ఆలోచన రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఈ టెండర్లను తెరిపించి, నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు గుత్తేదారులు కోరుతున్నారు.

పెనుకొండలో 'అధికార' లిక్కర్‌వార్.!

బికె మద్దతుదారులను అడ్డుకుంటున్న సవితమ్మ మద్దతుదారులు

◆మంత్రి, ఎంపీ వర్గీయుల పోటాపోటీ
◆ఎంపీ మద్దతుదారులను అడ్డగించిన మంత్రి అనుచరులు
◆ముగ్గురు నేతల అనుచరులు పెద్ద ఎత్తున టెండర్ల దాఖలు

ప్రజాశక్తి-పెనుకొండ

మద్యం షాపుల టెండర్ల వ్యవహారం పెనుకొండ అధికార పార్టీలో కాక పుట్టిస్తోంది. ఏకంగా మంత్రి సవితమ్మ, ఎంపీ బికె.పార్థసారథి మద్దతుదారులు ఒకరినొకరు బహిరంగంగానే దూషించుకునే పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. మద్యం షాపుల టెండర్ పత్రాలు దాఖలు చేసేందుకు వెళ్లిన ఎంపీ బికె.పార్థసారథి మద్దతుదారులను మంత్రి సవితమ్మ అనుచరులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. పెనుకొండ నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ముగ్గురు నేతల అనుచరులు పోటాపోటీగా టెండర్ల దాఖలు చేస్తున్నారు.

పెనుకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 13 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. పెనుకొండ టౌన్ పరిధిలో 3, పెనుకొండ రూరల్ పరిధిలో గుట్టూరు 1, అమ్మవారుపల్లి 1, రొద్దం 1, సోమందేపల్లి 3, గోరంట్ల 4 షాపులకు టెండర్లు నమోదు జరుగుతోంది. ఈ నాలుగు మండలాల పరిధిలో మంత్రి సవిత వర్గానికి చెందిన కొందరు నాయకులు టెండర్ల వేసేందుకు గ్రూపులుగా ఏర్పడ్డారు. మరోవైపు ఇదే నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎంపీ బికె.పార్థసారథి మద్దతుదారులు సైతం టెండర్ల వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం నాడు పెనుకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో టెండర్ల దాఖలు చేసేందుకు ఎంపీ మద్దతుదారులు వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న మంత్రి సవిత అనుచరులు వారిని అడ్డుకున్నారు. టెండర్ల వేసేందుకు స్టేషన్‌ల్లోకి వెళ్లరాదంటూ వాదనకు దిగారు. తాము టెండర్లు వేసి తీరుతామని బికె మద్దతుదారులు చెప్పడంతో అక్కడ పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న సిఐ రాఘవన్ ఇరు వర్గాల వారికి నచ్చజెప్పి వారిని స్టేషన్ అవరణ నుంచి బయటకు పంపారు. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకులు జివిపి.నాయుడు, రొద్దం సుబ్బరత్నమ్మ తదితరులు టెండర్ల వేసేందుకు అనుచరులను వెంటపెట్టుకుని వచ్చారు. స్టేషన్ గేటు వద్దే వారిని సవితమ్మ మద్దతుదారులు అడ్డగించి వాగ్వాదనకు దిగారు. అక్కడే ఉన్న కొందరు సీనియర్ నాయకులు జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పారు. అనంతరం నాయకులు అంతా ఓ నాయకుని ఇంట్లో సమావేశం అయ్యి టెండర్ల దాఖలపై మంతనాలు జరిపారు. మరో వైపు మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప మద్దతుదారులు సైతం గోరంట్ల మండలంలో మద్యం షాపులకు 20 టెండర్ల దాఖలు చేశారు. ఇలా పెనుకొండ నియోజకవర్గంలో ముగ్గురు నేతల మద్దతుదారులు షాపులను దక్కించుకునేందుకు పోటాపోటీగా టెండర్ల దాఖలు చేశారు. కాగా ఒకే పార్టీ నేతలు షాపులను దక్కించుకునేందుకు బహిరంగంగా ఇలా వాదులాడుకోవడం ఆ పార్టీలో తీవ్ర చర్చనీయాంశం అవుతోంది.

ఇజ్రాయిల్ దాడులతో అశాంతి

◆పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపాలి ◆పీడీఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ◆అనంతలో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శాంతిర్యాలీలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న యుద్ధ దాడులు తీవ్ర అశాంతిని రేకెత్తిస్తూ, అమాయక ప్రజల ప్రాణాలను బలిగొట్టుకున్నాయని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనాపై జరుగుతున్న యుద్ధం దాడిని ఆపాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో సోమవారం నాడు శాంతిర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ భవన్ నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తెలుగుతల్లి కూడలి వరకు శాంతిర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించి ఏడాది అవుతోందన్నారు. యుద్ధంలో భీకర దాడులతో ప్రజలు ప్రాణాలు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 44 వేల మంది చనిపోయినట్లు తెలుస్తోందన్నారు. మరణించిన వారిలో ఏడు వేల మంది చిన్న పిల్లలు ఉండడం అత్యంత విచారకరమైనదన్నారు. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ దుర్మార్గంగా పాలస్తీనాపై దాడులు చేస్తోందని మండిపడ్డారు. ప్రపంచంలోని ప్రజాస్వామ్య వాదులంతా ఈ దాడులను ఖండించాలని కోరారు. ప్రస్తుతం పాలస్తీనా భూభాగం అంతా ఇజ్రాయిల్ ఆక్రమణలోకి వెళ్లిందన్నారు. పాలస్తీనా దేశం ఏర్పడితేనే న్యాయమైన పరిష్కారం దొరుకుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి స్పందించి ఇజ్రాయిల్ దాడులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదులు తమ ఆయుధాలను అమ్ముకోవడానికి యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచ ఐక్యతను కాపాడే ఐక్యరాజ్యసమితి ప్రేక్షకపాత్రలో ఉండడం సరికాదన్నారు. పాలస్తీనాపై జరుగుతున్న యుద్ధాన్ని ఆపించేలా ప్రపంచ దేశాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ ఇజ్రాయిల్ దుర్మార్గంగా చిన్న దేశాలపై దాడులు చేసి ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటుందని విమర్శించారు. దీన్ని ప్రజాస్వాములు అంత ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, వి.సావిత్రి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు షేకన్న, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌వి.నాయుడు, ఎం.నాగమణి, మన్నీల రామాంజనేయులు, వై.వెంకట నారాయణ, నగర నాయకులు వలీ, నూరుల్లా, చంద్రిక, ఐలు జిల్లా అధ్యక్షులు సతీష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసన్న, అశోక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్ధూ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కారుణ్య నియామకాలు

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కారుణ్య నియామకాలను అత్యంత పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫిరెన్స్ హాల్లో కారుణ్య నియామకాలు, స్పెషల్ రిక్రూట్మెంట్ డ్రైవ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నియామకాలు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కారుణ్య నియామకాలు, స్పెషల్ రిక్రూట్మెంట్ డ్రైవ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నియామకాలు, బ్యాక్ లాగ్ పోస్టులు, పిహెచ్ కేటగిరీల కింద వేగవంతంగా నియామకాలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా నియామకాలకు సంబంధించి నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ డిఎం, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ రమేష్ రెడ్డి, ఎపిఈడబ్ల్యూఐడిసి ఈఈ రమణారెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలి

జిల్లాలోని అన్ని పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇందుకోసం మిషన్ మోడ్‌లో పని చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫిరెన్స్ హాల్లో ప్రభుత్వ వైద్యశాలలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఒ డా॥ఈబి.దేవి, ఎన్‌హెచ్‌ఎం డిపిఎంఒ రవి శంకర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥వెంకటేశ్వరరావు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ఆరెకటికల అభివృద్ధికి కృషి : ఎంపి

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలోని ఆరెకటికల సామాజిక వర్గం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని సునామ జకనీమాతా ఆలయ ప్రాంగణంలో నూతన భోజనశాల, విడిది గదుల నిర్మాణానికి టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు గుమ్మనూరు నారాయణతో కలిసి భూమిపూజ చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న భోజనశాల నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.10లక్షలు మంజూరు చేస్తామన్నారు. అలాగే ఎస్‌కెయులో వైస్ ఛాన్సలర్ పోస్టుకు ఆరెకటికలకు కేటాయించేందుకు ప్రతిపాదించామన్నారు. ఆ విషయమై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడుతామన్నారు. కాగా మున్సిపాలిటీలో నెలకొన్న తాగునీటి సమస్యను టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి, నాయకులు దిల్కాశీనా, పి.శ్రీకాంత్‌చౌదరి, జక్కలచెరువు ప్రతాప్, చికెన్ శీనా, జి.సుంకన్న, పిల్లెల్లి కృష్ణయ్య, బేతాపల్లి రమేష్, ఎంఆర్‌పిఎస్ నాయకురాలు కె.సునీత, తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా

ఫిర్యాదుల దినోత్సవం

హాజరుకాని అధికారులు-ప్రజల అసహనం

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే ఫిర్యాదు దినోత్సవాన్ని అధికారులు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ఫిర్యాదుల దినోత్సవానికి మండల స్థాయి అధికారులు అందరూ హాజరుకావాలి. అయితే కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కుతూ పూర్తిస్థాయిలో అధికారులు ఫిర్యాదుల దినోత్సవానికి హాజరుకావడం లేదన్న ఆరోపణలు వినిస్తున్నాయి. దీంతో అనేక సమస్యలపై కార్యాలయానికి వస్తున్న బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది తప్ప.. తగ్గిన పాపానపోలేదు. కేవలం కొంతమంది అధికారులు మాత్రమే కార్యాలయానికి చుట్టపు చూపుగా హాజరవుతూ కార్యాలయ పట్టికలో సంతకాలు చేసి వెంటనే వ్యక్తిగత పనులకు వెళ్లిపోతున్నట్లు సమాచారం. సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవంలో తహశీల్దార్, హౌసింగ్ ఎఇ, ఎంఇఒ, ఎపిఎం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, వ్యవసాయ అధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ తప్ప మిగిలిన అధికారులు హాజరుకాకపోవడం గమనార్హం. ఈ విషయంపై తహశీల్దార్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా ఫిర్యాదుల దినోత్సవానికి గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఫిర్యాదుల దినోత్సవానికి మండలస్థాయి అధికారులు అందరూ హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎకరాకు 40 కిలోల పప్పుశనగ పంపిణీ చేయాలి

రైతుసంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలోని రైతులకు ఎకరాకు 40కిలోల చొప్పున పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎఒ చెంగలరాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజారామిరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా ఉన్న నల్లరేగడి భూముల్లో పప్పుశనగ పంట సాగు చేయాలంటే ఎకరాకు సుమారు 45 నుంచి 50 కిలోల విత్తనాలు అవసరం అవుతాయన్నారు. కావున ప్రభుత్వం స్పందించి కనీసం ఎకరాకు 40 కిలోలు అన్నా ఇస్తే రైతులు సాగు చేస్తారన్నారు. పుట్లూరు, తాడిపత్రి క్లస్టర్లలో రైతులకు ఎకరానికి 40 కిలోల చొప్పున శనగలు అందించారన్నారు. అయితే యల్లనూరు మండలంలో మాత్రం ఎకరాకు కేవలం 20 కిలోలు మాత్రమే ఇవ్వడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 40కిలోలు పంపిణీ చేయాలని కోరారు. అలాగే జంగంపల్లి రైతులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరరావుకు వినతి పత్రం అందించారు.



అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నాయకులు

పంటలను పరిశీలిస్తున్న జెసి శివ్‌నారాయణ్‌శర్మ

ఈపంట నమోదుపై సూపర్‌చెక్

శింగనమల : మండల కేంద్రంతోపాటు ఆనందరావుపేట గ్రామాల్లో ఈ-పంట నమోదుపై జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ సోమవారం సూపర్ చెక్ చేశారు. ఇందులో భాగంగా శింగనమల రెవెన్యూ గ్రామంలోని రాచేపల్లి రెవెన్యూ గ్రామంలో సాగు చేసిన వేరుశనగను పరిశీలించి రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, విఆర్ఒ తాతయ్య, ఎంపిఇఒలు జయలక్ష్మి, ఉమాదేవి, ఆయా రెవెన్యూ గ్రామాల అధికారులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల్లోనూ డీడీలు తీయొచ్చు

అనంతపురం క్రైం : మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వారు జీవో 217 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా షెడ్యూల్ బ్యాంకుల్లో డీడీలు తీయవచ్చని ఎక్సైజ్ డీసి పి.నాగమద్దయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి, అనంతపురం లేదా పుట్టపర్తి, శ్రీసత్యసాయి జిల్లా పేరుపై డీడీలు తీయవచ్చన్నారు.

నేడు గ్రామసభ

నార్పల : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచి సుప్రియ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధి కింద 2025-26లో కొత్త పనులను ఎంపిక చేసేందుకు చర్చించనున్నట్లు తెలిపారు.

మహిళా సంఘాల అభివృద్ధికి చేయూత

పామిడి : డ్వాక్రా మహిళా సంఘాల అభివృద్ధికి యూనియన్ బ్యాంకు నుంచి ఎప్పుడూ సహాయ, సహకారాలు అందిస్తామని బ్యాంకు మేనేజర్ రామలింగంచౌదరి తెలిపారు. సోమవారం మండలంలోని రామగిరి గ్రామంలో వెలుగు సంఘాల మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వీటిని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సాగర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వృత్తివిద్యపై విద్యార్థులకు శిక్షణ

గార్లదిన్నె : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు కుట్టుమిషన్, ఎంబ్రాయిడింగ్‌పై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సాకే సతీష్ మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలో నూతన విద్యావిధానం ప్రకారం జనరల్ సబ్జెక్టులతోపాటు ఒక వృత్తి విద్యను కూడా విద్యార్థులు నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంబ్రాయిడరీ, టైలరింగ్, ఫ్యాషన్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వృత్తివిద్య కోఆర్డినేటర్లు మధు, యోగేష్‌రెడ్డి, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపిడిఒను కలిసిన టిడిపి నాయకులు

పుట్లూరు : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ అలివేలమ్మను టిడిపి నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపిడిఒను కలిసిన వారిలో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, రవికుమార్‌రెడ్డి, రామచంద్రనాయుడు, బ్రహ్మయ్య, పెద్దిరాజు, ఎర్రన్న, సురేంద్ర, తదితరులు ఉన్నారు.

నేడు జాబ్‌మేళా

నార్పల : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డిఆర్‌డిఎ సంయుక్తంగా మంగళవారం మండల కేంద్రం సమీపంలోని ప్రభుత్వ పోలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, అభి గ్రీన్ టెక్నాలజీ ప్రముఖులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ : 90100 39901 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కళ్యాణదుర్గం : బోరంపల్లి ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈజాబ్‌మేళాలో టెన్త్ నుంచి డిగ్రీ వరకూ చదువుకుని 39ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగులు అర్హులు అన్నారు.

వరద బాధితులకు విరాళం

శింగనమల : మండల పరిధిలోని ఈస్టు నరసాపురం, సోదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థులు సేకరించిన విరాళాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందజేశారు. విద్యార్థులు, అధ్యాపకులు ఇంటింటికీ వెళ్లి సేకరించిన రూ.10వేల డీడీని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సోదనపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్ ఉపాధ్యాయులు వివేకానంద, మధుసూదన్‌రెడ్డి, బైపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు విరాళం డీడీని అందజేస్తున్న ఉపాధ్యాయుడు

'శ్రీరామిరెడ్డి' కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు-కలెక్టర్, జెడ్పీ ఛైర్‌పర్సన్‌కు సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు బకాయి వేతనాలు, పీఎఫ్ చెల్లించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ సాధన కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి 8వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సోమవారం సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అధ్యక్షతన నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తాగునీటి సరఫరా కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ వేతనాల కోసం తాగునీటి సరఫరా కార్మికులు రెండు, మూడు నెలలకోసా రోడ్డెకాల్సిన పరిస్థితులు వస్తున్నాయన్నారు. గత సెప్టెంబర్‌లో చేసిన సమ్మె నేపథ్యంలో ఆనెల 17న స్వయానా కలెక్టర్ ఇచ్చిన హామీతో సమ్మె వాయిదా వేశారన్నారు. ఈనేపథ్యంలో 13 రోజులుగా వేతనాల కోసం కార్మికులు ఎదురు చూసినప్పటికీ సమస్య పరిష్కారం కానందున తిరిగి సెప్టెంబర్ 29 నుంచి కార్మికులందరూ కూడా సమ్మెలోకి వెళ్లారన్నారు. అయినా ఎలాంటి స్పందన లేదన్నారు. వెంటనే బకాలు వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాలను ఎమ్మెల్సీతోపాటు జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు వేర్వేరువగా వినతిపత్రాలు అందజేశారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు నాగమణి, తాగునీటి కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.ఎర్రిస్వామి, కార్యదర్శి జి.రాము, ప్రభాకర్, నాగేంద్ర, వన్నూరుస్వామి, సోమశేఖర్, గంగాధర్, రమేష్, సంజప్ప, కార్మికులు పాల్గొన్నారు

ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

దళితుల పక్షపాతి ఐఎస్ఎస్ఆర్ శంకరన్

వర్ధంతి సభలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దళితుల పక్షపాతిగా ఐఎస్ఎస్ఆర్ శంకరన్ అని గుంటూరు, కృష్ణ జిల్లాల పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు కొనియాడారు. సోమవారం అనంతపురంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌లో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప అధ్యక్షతన ఐఎస్ఎస్ఆర్ శంకరన్ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఐఎస్-ఎస్ఆర్ శంకరన్ జీవితమంతా దళిత, గిరిజనుల అభివృద్ధి కోసమే కృషి చేశారన్నారు. ముఖ్యంగా గురుకుల పాఠశాల విద్య, గిరిజనుల అభివృద్ధి కోసం ఐ టిడిఎ వ్యవస్థను తెచ్చారని గుర్తు చేశారు. అంతేగాకుండా సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని అములు చేయించారన్నారు. ఐఎఎస్ అయినా సొంత ఇల్లు లేదన్నారు. దీన్నిబట్టి చూస్తేనే ఆయన జీవితం అర్థం అవుతుందన్నారు. ఆయన చూపిన చూపిన ఆదర్శాలు, విలువలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎంసి కన్వీనర్ సత్యబోస్, యాపిల్స్ ఎన్‌జిఒ తిరుపాల్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న, అశోక్, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, సిఐటియు జిల్లా నాయకులు రామాంజినేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు, పరమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎస్ఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే'

ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరంలోని కమలానగర్‌లో ఉదయం 7 గంటలకు మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా మున్సిపల్ అధికారులతోపాటు వివిధ శాఖల అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఎక్కువగా పారిశుధ్యంపై ఎక్కువగా ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకునేందుకే మీ ఇంటి వద్దకు వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. నగరంలో డ్రెయినేజీ సమస్య ఎక్కువగా ఉందని.. దీనికి ఏకైక పరిష్కారం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మాత్రమేనన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డిపిఆర్‌లు కూడా సిద్ధం చేసినట్లు చెప్పారు. త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు దలవాయి వెంకటనారాయణ, టిడిపి నాయకులు దాడి మల్లికార్జున, దాడి చంద్ర, దాడిరమేష్, రమణ సికిందర్, మణెమ్మ, ముస్తాక్, సురేష్, బిజెపి నాయకురాలు లక్ష్మీదేవి, టిడిపి నాయకులు కార్యకర్తలు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు

పాలస్తీనాలో శాంతి నెలకొల్పాలి

సిపిఎం, అనుబంధ ప్రజాసంఘాల ఆందోళన

ప్రజాశక్తి-గుంతకల్లు

ఐక్యరాజ్య సమితి వెంటనే జోక్యం చేసుకుని పాలస్తీనాలో జరుగుతున్న మారణహోమాన్ని అడ్డుకోవడం తోపాటు శాంతిని నెలకొల్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సిపిఎంతోపాటు అనుబంధ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, ఆవాజ్, కెవిపిఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం, పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహినంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలస్తీనాలోని గాజాపై జరుగుతున్న మారణహోమం జరగబట్టి సంవత్సరం పూర్తయినా శాంతిని నెలకొల్పేందుకు ఐక్యరాజ్య సమితి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. సంవత్సర కాలంలో దాదాపు 45 వేల మంది అమాయక ప్రజలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ మారణహోమాన్ని ఆపాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యులు బి.తిమ్మప్ప, ఓబులేసు, ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు బి.జ్యోతి, నాయకురాళ్లు ప్రభావతి, సాయి, లక్ష్మీబాయి, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సురేంద్ర, నాయకులు సి.రాము, విక్రమ్, ప్రసన్న, సాయి, సాగర్, సుధీర్, ఎస్ఎఫ్ఐ నాయకులు చందునాయక్, అశోక్, హుస్సేన్, ఆవాజ్ నాయకులు షబ్బీర్, మస్తాన్, కెవిపిఎస్ నాయకులు రామునాయక్, సూరి, ఈరన్న, పరశు రామ్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

కూటమి ఎమ్మెల్యేలు తీరు మార్చుకోవాలి

వైసిపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం : కూటమి ఎమ్మెల్యేలు తమ తీరు మార్చుకుని వ్యవహరిస్తే బాగుటుందని వైసిపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం ప్రభుత్వం 15 ఫైనాన్స్ కమిషన్ నిధులు కేటాయిస్తే కొంతమంది కూటమి ఎమ్మెల్యేలు పంచాయతీ కార్యదర్శులను అడ్డు పెట్టుకుని కమీషన్ల కోసం తమకు కలవాలని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు పూర్తయినా స్థానిక సంస్థలకు ఒక్క రూపాయి కేటాయించకపోవడం బాధాకరమన్నారు. అంతేగాకుండా ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం కల్పించిన ప్రొటోకాల్ హక్కులకు కూడా విఘాతం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల పొగడ్తల కోసం అధికారులు వైసిపి నుంచి ఎన్నికైన సర్పంచులు, ఎంపిటిసిలు, ఎంపిపి, జడ్పిటిసిలకు తగిన గౌరవం ఇవ్వడం లేదన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ప్రొటోకాల్, వారి అధికారాల్లోకి జొరబడితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వినూత్న

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి సత్వరమే పరిష్కారం చూపుతామని ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వినూత్న తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఇందులో భాగంగా పలు సమస్యలపై 32 మంది వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ మాట్లాడుతూ ఆయా సమస్యల వినతిపత్రాలను సంబంధిత అధికారులకు బదిలీ చేసి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బడి పిలుస్తోంది చిత్రం పోస్టర్లను విడుదల చేస్తున్న అతిథులు

'బడి పిలుస్తోంది'కి అవార్డుల పంట

నేడు ఎన్.మార్క్స్‌లో ఉచిత ప్రదర్శన

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల విజయవాడలో జరిగిన షార్ట్ ఫిలిం పోటీల్లో అనంతపురం నుంచి ఫైట్ ఫర్ రైట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ దర్శకుడు తరిమెల రాజు దర్శకత్వంలో బాల్య వివాహాలపై రూపొందించిన 'బడి పిలుస్తోంది' చిత్రానికి అవార్డుల పంట పండింది. ఈ చిత్రం 8 అవార్డులు కైవసం చేసుకోవడంతో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షులు టివి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.అల్తాఫ్ అభినందించారు. కాగా ఈ చిత్రాన్ని ఈనెల 8వ తేదీ మంగళవారం ఉదయం 8:30 గంటలకు స్థానిక ఎన్.మార్క్స్ థియేటర్‌లో ఉచితంగా ప్రదర్శించనున్నారు. ఈ చక్కటి అవకాశాన్ని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా చూడాలని ఇలాంటి సందేశాత్మక చిత్రాలను మరిన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

ఎడిసిసిబిలో నూతన వడ్డీ డిపాజిట్ పథకం

వడ్డీ డిపాజిట్ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, బ్యాంకు ఇన్‌ఛార్జి శివ్‌నారాయణ్‌శర్మ, అధికారులు

అనంతపురం : ఎడిసిసి బ్యాంకులో నూతనంగా తీసుకొచ్చిన వడ్డీ డిపాజిట్ పథకాన్ని జాయింట్ కలెక్టర్, బ్యాంకు ఇన్‌ఛార్జి శివ్‌నారాయణ్‌శర్మ సోమవారం ప్రారంభించారు. ఎడిసిసి బ్యాంకులో 444 రోజుల కాల పరిమితితో వడ్డీరేటు 8.35శాతం సీనియర్ సిటిజన్స్‌కు, ఇతరులకు 7.85శాతంతో పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ కె.సురేఖారాణి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ముగిసిన స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబిఎ, ఎంసిఎ విభాగాల్లో కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లకు భర్తీ కోసం నిర్వహించిన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం ముగిసింది. ఎంసిఎ విభాగంలో మిగిలిన 4 సీట్లకు ఆరుగురు, ఎంబిఎలో మిగిలిన 9 సీట్లకు మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా విద్యార్థుల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించిన ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిషన్స్ డైరెక్టర్ కిరమ్మయి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి టీజీ భరత్‌ను కలిసిన ఎంపీ అంబికా

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోమవారం కర్నూలులోని మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి జ్ఞాపిక అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన అవకాశాలను మంత్రికి వివరించారు. అనంతపురం పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దాలని కోరారు.

అనంతపురం అభివృద్ధికి కృషి

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం పార్లమెంట్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ అన్నారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని రామ్‌నగర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు రైల్వే అండర్ పాస్‌ను విస్తరణ చేసేందుకు విజయవాడలో జరిగిన దక్షిణ మధ్య రైల్వే సమీక్ష సమావేశంలో చర్చించినట్లు ఎంపీ తెలిపారు. అలాగే నియోజవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులతో చర్చించారు.

ఎంపీ, ఎమ్మెల్యేతో చర్చిస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్

ఫిర్యాదుదారులకు తక్షణ పరిష్కారం చూపాలి

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చే ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూడాలని ఎస్పీ పి.జగదీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 99 పిటీషన్లు వచ్చాయి. ఈ సందర్భంగా స్వయానా ఎస్పీ బాధితులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను లోతుగా విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా కుటుంబ కలహాలు, భార్యాభర్తల గొడవలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఎస్పీతోపాటు డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా కూడా ప్రజల నుండి పిటీషన్లు స్వీకరించారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అధికారులు బాధ్యతల స్వీకరణ

కమిషనర్ నయీం అహ్మద్

ఇంజనీర్ లీలాకృష ప్రసాద్

ఎసిపి ఎస్.శ్రీనివాసులు

గుంతకల్లు : సాధారణ బదిలీల్లో భాగంగా గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌తోపాటు పలువురు అధికారులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకట రమణయ్య బదిలీపై వెళ్లగా డిఎంఎ కార్యాలయంలోని నయీం అహ్మద్‌ను నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఇక్కడ మున్సిపల్ ఇంజినీరుగా పని చేస్తున్న గురప్పయాదవ్ నంద్యాలకు వెళ్లగా కడప మున్సిపాలిటీలో టిడ్కో హౌసింగ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న లీలాకృపప్రసాద్ గుంతకల్లుకు వచ్చి బాధ్యతలు చేపట్టారు. అలాగే ఆదోని మున్సిపాలిటీలో అసిస్టెంట్ సిటీప్లానర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.శ్రీనివాసులు గుంతకల్లు మున్సిపాలిటీకి వచ్చి బాధ్యతలు బాధ్యతలు చేపట్టారు.

గుంతకల్లు డిఎల్‌డిఒగా విజయలక్ష్మి

గుంతకల్లు రూరల్ : గుంతకల్లు డివిజినల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం డ్రామా కార్యాలయంలో ఎఒగా పని చేస్తున్న విజయలక్ష్మినికి ఇక్కడిని నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను అంగన్వాడీ నుంచి వివిధ విభాగాల్లో పని చేసిన అనుభవం ఉందన్నారు. ఆ అనుభవంతో గుంతకల్లు డివిజన్ పంచాయతీ అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తానని తెలిపారు.

గుమ్మఘట్ట ఎంపిడిఒగా రామకృష్ణ

గుమ్మఘట్ట : మండల నూతన ఎంపిడిఒగా రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపప్పూరులో పని చేసిన రామకృష్ణను సాధారణ బదిలీల్లో భాగంగా గుమ్మఘట్టకు బదిలీ చేయడంతో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కుందుర్పి ఇఒఆర్‌డిగా హరికృష్ణ

కుందుర్పి : మండల నూతన ఇఒఆర్‌డిగా హరికృష్ణ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పంచాయతీలను అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. సర్పంచులు, అధికారులతో సమన్వయం చేసుకుని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాగా ఒఎ శంకర్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఇఒఆర్‌డికి శుభాకాంక్షలు తెలిపారు.

బెలుగుప్ప ఎంపిడిఒగా టి.లక్ష్మీనారాయణ

బెలుగుప్ప : మండల నూతన ఎంపిడిఒగా టి.లక్ష్మీనారాయణ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాడికి మండలం నుంచి బెలుగుప్పకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కాగా ఎంపిడిఒకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పుట్లూరు సిఐగా సత్యబాబు

పుట్లూరు : పుట్లూరు సిఐగా సత్యబాబు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పుట్లూరు సీఐగా విధులు నిర్వహిస్తున్న సుబ్రమణ్యంను అనంతపురం విఆర్‌కు బదిలీ చేయగా చిత్తూరు జిల్లాలో వీఆర్‌లో ఉన్న సత్యబాబును పుట్లూరు సిఐగా బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండలంలో ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో కూలీ మృతి

మృతిచెందిన నగేష్

పెద్దవడుగూరు : విద్యుదాఘాతతంలో కూలీ మృతిచెందిన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చింతలచెరువుకు చెందిన నగేష్ (40) కూలితోపాటు విద్యుత్ మరమ్మతులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇందులో భాగంగా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి వీధిదీపాలను సరిచేస్తుండగా ఉన్నట్టుండి విద్యుత్ సరఫరా అయింది. దీంతో షాక్ గురై కరెంటు స్తంభం నుంచి కింద పడ్డాడు. పైనుంచి కిందికి పడటంతో తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు పెద్దఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నగేస్ మృతిచెందాడని బంధువులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్నరెడ్డెప్ప ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యకేసు నిందితులు అరెస్టు

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘంలో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తూ హత్యకు గురైన కొల్లప్ప హత్య కేసులో ఇద్దరు నిందితులను సోమవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ హత్యకు గురైన కొల్లప్ప, రాయదుర్గానికి చెందిన పవన్‌కుమార్, మధుసూదన్ స్నేహితులు. ఈనేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో పవన్‌కుమార్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని కొల్లప్ప డబ్బులు తీసుకున్నాడు. అయితే ఉద్యోగం ఇప్పించలేదు. ఈనేపథ్యంలో గత ఆదివారం పట్టణ పొలిమేరలో ఉన్న జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో కొల్లప్పను రాయితో కొట్టి హత్య చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్లప్ప కనిపించడం లేదని కేసు నమోదు చేయగా పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్, ఎస్ఐ వలి సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా సోమవారం మధ్యాహ్నం నిందితులపై అనుమానం ఇచ్చి అదుపులోకి తీసుకుని విచారింగా తామే హత్య చేసినట్లు అంగీకరించారన్నారు. అనంతరం నిందితులను అదుపులోకి తీసుకోవడంతోపాటు హత్యకు ఉపయోగించిన రాయి, సెల్‌ఫోన్, మోటార్ సైకిల్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల అరెస్టులో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి పురస్కారాలకు సిఫారసు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతిచెందిన లాలెప్ప

పామిడి : మండలంలోని గజరాంపల్లి గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..గజరాంపల్లి గ్రామ సమీపంలో గుత్తి వైపు నుంచి పామిడి వైపునకు మోటార్ సైకిల్‌పై వస్తున్న లాలెప్ప (48)ను వెనుక నుంచి అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని ఐచర్ వాహనం ఢీకొట్టింది. దీంతో లాలెప్పకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు లాలెప్పను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతిచెందిన లాలెప్ప గుత్తి ఆదర్శ పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పేకాట జూదరులు అరెస్టు

గుత్తి : పట్టణంలోని ఫుట్ బాల్ మైదానంలో సోమవారం పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సిఐ బి.వెంకటేశ్వర్లుకు పక్కా సమాచారం రావడంతో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన వి. బాలకృష్ణ, కె.మధు, బి.లక్ష్మీనారాయణ, ఎన్.నవీన్‌కుమార్‌ను అరెస్టు చేసి రూ.18,500 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. అలాగే మట్కాబీటర్ ఎం.రామును అరెస్టు చేసి రూ.27,600 నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని చెప్పారు.



వసూరమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ సర్పంచి భార్య మృతి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని బైరవనితిప్ప మాజీ సర్పంచి వాసురప్ప భార్య వసూరమ్మ (82) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, టిడిపి నాయకులు మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కురుగొడ, నాయకులు జితేంద్రగౌడ్, వన్నూరుస్వామి, మల్లికార్జున, కురిమల్లి, డీలర్ లింగన్న, బజ్జన్నగౌడ్, నరసింహులు, అయ్యేనల్లి చిక్కన్న, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడు పత్తి చలపతి మృతి

అనంతపురం కలెక్టరేట్ : జనసేన పార్టీ నాయకుడు పత్తి చలపతి (77) మృతిచెందారు. అనారోగ్యం కారణంగా ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన సోమవారం అనంతపురంలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు ఆయన పార్థివదేహాన్ని పలువురు సందర్శించి నివాళు లర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు కుమారుడు పత్తి చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'ఉపాధి'పై సమీక్ష

ఆత్మకూరు : 2024-25వ సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద పనులు గుర్తించేందుకు సోమవారం ఉపాధి సిబ్బందికి సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా పండ్ల తోటల పెంపకం, పొలం గట్లపై మొక్కలు నాటడం, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహ, విస్తరణ అధికారి కమ్మక్క, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, ఎపిఒ సుజాత, ఇఒ పార్థసారధి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శివకుమార్, హౌసింగ్ ఎఇ జమీల్‌బాషా, ఇసి విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పాత రుణాలు చెల్లించి కొత్త రుణాలు పొందండి

బ్రహ్మసముద్రం : మండలంలోని మహిళా సంఘాల సభ్యులు పాత రుణాలు చెల్లించి తక్షణమే నూతన రుణాలు పొందాలని వెలుగు ఎసి నారాయణస్వామి సూచించారు. ఆయన సోమవారం స్థానిక జననీ మండల సమైక్య కార్యాలయంలో వెలుగు ఎపిఎం నీలామణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల యానిమేటర్లు స్వర్ణాంధ్ర సర్వేలో చెప్పిన అంశాలను తప్పక సర్వే చేయాలన్నారు. ప్రతి సభ్యురాలు తీసుకున్న రుణాన్ని చెల్లించి నూతన రుణాన్ని పొందే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో సీసీ దూల తిమ్మ వేణుగోపాల్, యానిమేటర్లు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

ఉరవకొండ : ఉరవకొండ గ్రామ నరసప్ప మఠం వద్ద ఉన్న జమ్మిచెట్టుకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన ముళ్లపొదలు, మట్టికుప్పలను పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ సోమవారం జెసిబితో తొలగించారు. మఠం దగ్గర ఉన్న జమ్మిచెట్టుకు వెళ్లే దారిలో ఏపుగా కంపచెట్లు పెరగడంతో దసర పండుగకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా జెసిబితో తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

రేపు అన్నక్యాంటీన్ ప్రారంభం

కళ్యాణదుర్గం : ఈనెల 9న బుధవారం పట్టణంలో అన్నక్యాంటీన్ ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. సోమవారం స్థానిక ప్రజావేదికలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌తో కలిసి ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దాసరి సునీత

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఎంపిపి దాసరి సునీత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసిబ్బంది రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపిపి దాసరి సునీత కోరారు. సోమవారం మండలంలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి సలహా మండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆసుపత్రికి ఎన్ని నిధులు వచ్చాయి.. ఎందుకు ఖర్చు చేశారు.. రోగులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారనే విషయాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సేవలు అందించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ కన్వీనర్, వైద్యాధికారి ఇందిరా ప్రియదర్శిని, వైద్యులు వినోద్‌కుమార్, ఆర్.విజయ భాస్కర్‌రెడ్డి, సర్పంచి కె.కామాక్షి, వైద్యసిబ్బంది మోహన్‌బాబు, పర్వీన్, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రకుమార్, ఫార్మాసిస్టు శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ కరుణాకర్, కేశవయ్య, మంజుల, నిర్మల, శ్యామల, రాజేంద్రప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

న్యాయం చేయాలని ధర్నా

పుట్లూరు : మహిళ మృతికేసులో న్యాయం కావాలని ఓ కుటుంబీకులు మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో రహదారిపై ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మూడు నెలల క్రితం మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతిచెందింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోలేదని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. చేసేది లేక సోమవారం కడవకల్లులో తాడపత్రి-పులివెందుల ప్రధాన రహదారిపైన బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న సిఐ సుబ్రమణ్యం ఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పారు. సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విన్నవిస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణాలకు స్థలాలు చూపాలని వినతి

ఉరవకొండ : ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణాలకు స్థలాలు చూపించాలని ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరమెట్ల యల్లన్న కోరారు. సోమవారం ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వై.రాంపురం, రాకెట్ల, మోపిడి, నెరమెట్ల, ఆమిద్యాల, నింబగల్లు, తదితర గ్రామాలకు ఎస్సీ కమ్యూనిటీ భవనాలు నిర్మించేందుకు ఆయా కాలనీల్లో స్థలాలు చూపించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు గుర్తించడంలో ఆలస్యం చూపకుండా వీలైనంత తొందరలో నివేదికల సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బళ్లారి ఎర్రిస్వామి, మోపిడి వన్నూరుస్వామి, రమేష్, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎంపికపై విచారించాలి

గుంతకల్లు : ఆర్‌డిఒ నియమించిన డివిజనల్ స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీపై సమగ్ర విచారణ చేపట్టాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ మేధావులను కమిటీలో నియమించకుండా అవగాహన లేని బిసి వర్గానికి చెందిన వ్యక్తిని మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమించడం సరైంది కాదన్నారు. వెంటనే విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాయలసీమ దళిత సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తగరం రామాంజనేయులు, ఎస్సీ, ఎస్టీ ఫోరమ్ అధ్యక్షులు ఎం.మహేంద్ర, రాష్ట్ర కార్యదర్శి ఎల్.భీమలింగ, అడ్వకేట్ కోరి చంద్రశేఖర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు నరసింహులు, కోళ్ల ఏసన్న, కసాపురం వేంకటేశ్, గుజ్జుల రవీంద్ర, సంపత్, బాలాంజనేయులు, మసాల రవికుమార్, ఎర్రిస్వామి, రామచంద్ర, నరసయ్య, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

వేతనం చెల్లించాలని మహిళ నిరసన

ప్రజాశక్తి-గుత్తి

నిరసన తెలుపుతున్న డి.తులసీబాయి

నాలుగేళ్లగా జీతాలు ఇవ్వకుండా తనను అక్రమంగా విధుల నుంచి తొలగించారని ఆరోపిస్తూ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థలో పని చేస్తున్న వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ డి.తులసీబాయి సోమవారం స్థానిక జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపింది. బాధిత మహిళ తెలిపిన వివరాల మేరకు.. పట్టణ శివార్లలో కొత్తపేట గ్రామ శివారులో ఉన్న హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థలో గుంతకల్లుకు చెందిన డి.తులసీబాయి 15ఏళ్ళుగా వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తోంది. అయితే సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణస్వామి 2020 వరకూ వేతనాలు చెల్లించారు. అప్పటి నుంచి వేతనాలు చెల్లించలేదని వాపోయింది. అంతేగాకుండా కార్యాలయానికి తాను రూ.2.50లక్షలు వెచ్చించి ఫర్నీచర్ తెచ్చానని, అందులో కొంచెం డబ్బు చెల్లించి ఎగ్గొట్టాడని అవేదన వ్యక్తం చేసింది. అలాగే జిల్లాలోని 10 మండలాల పరిధిలో తన సొంత ఖర్చుతో తిరిగి సేవలు అందించానన్నారు. ఆయా మొత్తం తనకు సంస్థ నుంచి సుమారు రూ.6.53లక్షలు రావాల్సి ఉందన్నారు. కావున తనకు న్యాయం చేయాలని గుత్తి- తాడిపత్రి మార్గంలోని 67వ జాతీయ రహదారిపై తులసీబాయి బైఠాయించి ఆందోళన చేసింది. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందిని పంపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆందోళనలను విరమింపజేశారు. ఈ విషయమై హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణస్వామిని వివరణ కోరగా నేరుగా తులసీబాయి అకౌంట్‌లోకే వేతనం జమ అవుతుందన్నారు. అయితే ఆమె ఎందుకు ఇలా చేసిందో అర్థం కావడంలేదన్నారు. రెండు నెలల్లోపు వేతనాలు ఇస్తామని సర్ది చెప్పి పంపించామన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-కుందుర్పి

ఇఒఆర్‌డితో మాట్లాడుతున్న సర్పంచులు

మండలంలోని వివిధ గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని సర్పంచులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఇఒఆర్‌డి రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ గతంలో చేసిన పనులకు కొంతమంది అధికారులు ప్రస్తుత అధికార పార్టీ నాయకుల మాటలు విని బిల్లులు చెల్లించడం లేదని వాపోయారు. వైసిపి సానుభూతిపరులుగా గెలిచిన తమకు చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. అంతేగాకుండా రానున్న కాలంలో కూడా ఎలా అభివృద్ధి చేస్తామని నిలదీశారు. ఇప్పటికే బిల్లులు చెల్లించాలని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారన్నారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైందన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు మొహం చూపించలేకపోతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరారు. ఇందుకు ఇఒఆర్‌డి స్పందిస్తూ ఇప్పుడిప్పుడే తాను బాధ్యతలు స్వీకరించానని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గంగాధర్, జగన్, మారుతీశ్వరి రామమూర్తి, విశాలాక్షి, వరలక్ష్మి, మహాదేవమ్మ, కొమ్ము మమత, హసీనాబీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో మలుపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు.. మండలంలోని కె.ఊబిచెర్లకు చెందిన చంద్రశేఖర్ పని నిమిత్తం గుత్తికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన జయరాముడు, రాజ్‌కుమార్ ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తరలించారు. విషయం తెలుసుకున్న అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ గుత్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, నాయకులు